రాష్ట్రానికి విదేశీ జర్నలిస్టులు

- పది దేశాల నుంచి రాక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తెస్తున్న పర్యాటక, సాంస్కృతిక, పారిశ్రామిక, విద్యా కేంద్రాలను సందర్శించటానికి 21 మంది విదేశీ మీడియా ప్రతినిధులు రాష్ట్రానికి విచ్చేశారు. వీరంతా బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకున్నారు. రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ప్రోటోకాల్ విభాగం అధికారులు వీరికి స్వాగతం పలికారు. తూర్పు ఆసియా, యూరేసియా, మిడిల్ ఈస్ట్ ప్రాంతంలోని జార్జియా, ఆర్మేనియా, ఇరాన్, బెలారస్, తుర్క్‌మెనిస్తాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్తాన్, ఉజ్జెకిస్తాన్, మంగోలియా, కజకిస్థాన్ దేశాలకు చెందిన ప్రముఖ మీడియా ప్రతినిధులు నాలుగు రోజుల పర్యటనకు వచ్చారు. పర్యటనలో భాగంగా గోల్కొండ కోట, శిల్పారామం, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, స్కైరూట్ ఎయిరో స్పేస్ సెంటర్, టీ- హబ్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ , రామోజీ ఫిల్మ్ సిటీని ఈ మీడియా బందం సందర్శించనుంది. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన విదేశీ దౌత్యవేత్త కార్యాలయం అధికారులు సైతం ఈ పర్యటనలో పాల్గొంటున్నారు.

లోక్‌సభలో మోడీకి దీటుగా రాహుల్‌గాంధీ : నిరంజన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లోక్‌సభలో ప్రధాని మోడీకి ధీటుగా ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్‌గాంధీ సమర్థవంతంగా వ్యవహరిస్తారని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటులో మోడీ ఎమర్జెన్సీ గురించి మాట్లాడటం సరైంది కాదన్నారు. ఎవరో చేసిన తప్పుకు ఇందిరాగాంధీ బహిరంగంగా క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పెద్ద నోట్ల రద్దు చేయడం తప్పు అనే విషయాన్ని ఇప్పటివరకు మోడీ ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీ ప్రతిసారి ఎమర్జెన్సీ గురించి మాట్లాడం సరైందికాదని మాజీ ఎంపి వి హనుమంతరావు అన్నారు. కేవలం ఇందిరా గాంధీపై కక్షతోనే ఆయన ఈవిధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

సిఎస్‌ను కలిసిన ఉజ్బెకిస్థాన్ రాయబారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉజ్బెకిస్థాన్ రాయబారి సర్దోర్ రుస్తాంబేవ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన మర్యాదపూర్వకంగా సిఎస్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులు తదితర విషయాలను సిఎస్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలి

- నిరసనలకు మాజీమంత్రి హరీశ్‌రావు మద్దతు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గురుకుల అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అభ్యర్థుల నిరసనలకు ఆయన మద్దతు ప్రకటించారు. రాజకీయాలే పరమావధిగా నడుస్తున్న కాంగ్రెస్ ప్రజాప్రభుత్వానికి గురుకుల ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల బాధలు కనిపించకపోవడం బాధాకరమని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంత్రులు, అధికారులను కలిసి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా, సిఎం ఇంటి ముందు మోకాళ్ల మీద నిలబడి అభ్యర్థించినా మొర ఆలకించకపోవడం శోచనీయమని విమర్శించారు. పేద, బడుగు, బలహీనవర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో గురుకులాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా విద్యాప్రమాణాలను పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో 9,210 పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. నిరుద్యోగులకు నష్టం జరగకుండా, ఒక్క పోస్టు కూడా మిగిలిపోవద్దనే లక్ష్యంతో ఫలితాలను ప్రకటించి వాటిని భర్తీ చేయాలని నిర్ణయించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించడం వల్ల ఒకే అభ్యర్థికి ఒకటి కంటే ఎక్కువ ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. దీనివల్ల సుమారు 2,500పైగా ఉపాధ్యాయ పోస్టులు మిగిలిపోయి నిరుద్యోగులు ఉద్యోగావకాశాలను కోల్పోయే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు.

నీట్ స్కామ్‌పై మోడీ మౌనమేలా..!

- అవతవకలు రుజువైనా ఎన్‌టిఎను రద్దు చేయకపోవడం దుర్మార్గం
- కేంద్రం స్పందించకపోతే దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తాం
- రాష్ట్ర విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ
- రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసనలు

ధర్నా చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని రుజువైనా ప్రధాని మోడీ మౌనంగా ఉండటం దుర్మార్గామని రాష్ట్ర విద్యార్థి, యువజన సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ విమర్శించింది. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి తిరిగి నిర్వహించాలని, ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో బుధవారం నిరసనలు తెలిపారు. ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎంపిల ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని నారాయణగూడ చౌరస్తా వద్ద విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఎన్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మహేష్, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, పివైఎల్ రాష్ట్ర నాయకులు కృష్ణ మాట్లాడారు. తెలంగాణ నుంచి 65 వేలకుపైగా విద్యార్థులు నీట్ పరీక్ష రాశారని, వారి భవిష్యత్తు గురించి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌కు మాట్లాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే అన్ని విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో త్వరలో ధర్నా చౌక్ వద్ద మహా దీక్ష, చలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే నీట్ కౌన్సెలింగ్ రోజు దేశవ్యాప్తంగా అన్ని విద్యార్థి, యువజన సంఘాలను ఏకం చేసి భారత్ బంద్ నిర్వహిస్తామని, కేంద్ర ప్రభుత్వం మేడలు వంచైనా ఎన్‌టిఎ, నీట్ పరీక్షలు రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఆదిలాబాద్ జిల్లాలో ఎంపి గోడం నగేష్ నివాసాన్ని విద్యార్థులు ముట్టడించారు. విద్యార్థులు ఎంపి ఇంటి ఎదుట బైటాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దాంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో వారి మధ్య తోపులాట జరిగింది. నాయకులను బలవంతంగా అక్కడి నుంచి అరెస్టు చేసి తీసుకెళ్లే క్రమంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నాయకులను వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. నీట్ లీక్‌పై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నా పార్లమెంట్‌లో ఏ ఒక్క ఎంపి మాట్లాడకపోవడం సిగ్గుచేపటన్నారు. నీట్ తప్పిదాలను కప్పిపుచ్చేందుకు జూన్ 14న రావాల్సిన ఫలితాలను, పార్లమెంట్ ఎన్నికల ఫలితాల రోజు విడుదల చేసి విద్యార్థులను పక్కదారి పట్టించారని విమర్శించారు. నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించడంతో పాటు ఎన్టీఏపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను విద్యార్థులు దహనం చేయగా.. వారిని పోలీసులు అడ్డుకున్నారు. విద్యార్థి యువజన నాయకులకు పోలీసులు మధ్య తోపులాట జరిగింది.

మా ఉద్యోగాలు మాకు ఇవ్వండి

- మోకాళ్లపై కూర్చుని గురుకుల ఉపాధ్యాయుల నిరసన
- సిఎం రేవంత్‌రెడ్డి ఇల్లు, గాంధీభవన్ వద్ద ఆందోళన
- పెద్దమ్మ గుడి వద్ద భిక్షాటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"మా ఉద్యోగాలు మాకు ఇవ్వండి.. ఎన్నికల వేళ జాబ్ క్యాలెండర్ ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటన్నింటినీ పక్కనపెట్టింటి.. ఉన్న ఉద్యోగాలను సైతం ఇవ్వకుండా మనోవేదనకు గురి చేస్తోంది" అని గురుకుల అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

బుధవారం గురుకుల అభ్యర్థులు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. అక్కడ నిరసనలకు ఎటువంటి అనుమతులూ లేవని.. సెక్యూరిటీరీత్యా ఈ ప్రాంతం నుంచి వెళ్లాలని పోలీసులు ఆదేశించడంతో వారు పెద్దమ్మ గుడి ముందు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. పలువురు మహిళా అభ్యర్థులు కొంగు పట్టి భిక్షాటన చేస్తూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా, ఇక్కడి నుంచి కూడా వెళ్లిపోవాలని జూబ్లీహిల్స్ పోలీసులు ఒత్తిడి చేయడంతో వారు నాంపల్లిలోని గాంధీభవన్ గేటు వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. డిసెండింగ్ ఆర్డర్‌లో ఉద్యోగాల భర్తీ చేపట్టి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వి వాంట్ జస్టిస్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. దాంతో నిరసన వ్యక్తం చేస్తున్న గురుకుల అభ్యర్థులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు.

అరుంధతి రాయ్‌పై ఉపా కేసు ఎత్తేయాలి

- మతోన్మాదాన్ని ప్రశ్నించినందునే కక్ష..
- సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రచయిత్రి అరుంధతి రాయ్, కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ షేక్ షౌకత్ హుస్సేన్‌పై ఢిల్లీ పోలీసులు మోపిన ఊపా కేసును ఎత్తేయాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. పోలీసులు మోపిన ఊపా కేసుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా అనుమతి మంజూరు చేయడాన్ని ఖండిస్తూ.. ఒయు విద్యార్థులు, రీసర్చ్ స్కాలర్స్ ఆధ్వర్యంలో 'అరుంధతి రాయ్‌పై ఉపా కేసు-వాస్తవాలు' అనే అంశంపై బుధవారం హైదరాబాద్ ఒయు ఆర్ట్స్ కళాశాల పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విద్యార్థి నాయకుడు, రీసర్చ్ స్కాలర్ నెల్లి సత్య అధ్యక్షత వహించగా, ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగించారు. పెరిగిపోతున్న మతోన్మాదాన్ని తన రచనల ద్వారా అరుంధతి రాయ్ దేశంలో తీవ్రంగా విమర్శించారని తెలిపారు. ఈ క్రమంలోనే 2010 అక్టోబర్ 21న ఢిల్లీలో జరిగిన "ఆజాది ది ఓన్లీ వే" అనే సదస్సులో జమ్ము కాశ్మీర్ రాష్ట్రానికి ఉన్న స్వయం ప్రతిపత్తి, అక్కడి ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై ఆమె చర్చించిన కారణంగా రూట్స్ ఇన్ కాశ్మీర్ సంస్థ సభ్యుడు సుశీల్ పండిట్ ఫిర్యాదుతో ఢిల్లీ పోలీసులు ఆమెపై, ఆ సదస్సులో పాల్గొన్న ఇతరులపై ఉపా కేసు పెట్టారని తెలిపారు. 14 సంవత్సరాల తర్వాత ఇప్పుడు దాన్ని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ విచారణకు అనుమతి ఇవ్వడమేంటని ప్రశ్నించారు. బిజెపి నియంతృత్వ పోకడలకు సాధారణ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పినా ఆ పార్టీ బుద్ధి మారలేదన్నారు. తక్షణమే అరుంధతి రాయ్‌తోపాటు ఇతరులపై పెట్టిన కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వర్, విద్యార్థి నాయకుడు రీసర్చ్ స్కాలర్ కోటా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అనేక ప్రజా ఉద్యమాలు, సామాజిక, విద్యార్థి ఉద్యమాల్లో క్రియాశీలకంగా ఉంటూ బాసటగా నిలిచిన వారిపైనా ఉపా కేసులు మోపారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమాలను అణచివేసి భావ ప్రకటనా స్వేచ్ఛను హరించాయని విమర్శించారు. ఆదివాసులకు జరుగుతున్న అన్యాయం, మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడుతున్నందునే అరుంధతి రాయ్‌పై కేంద్రం కక్షగట్టి ఉపా కేసు పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి వ్యతిరేకంగా విద్యార్థులు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ డాక్టర్ వంశీధర్, విద్యార్థి నాయకులు ఎస్.నాగేశ్వరరావు, పెంచాల సతీష్, వలిగొండ నరసింహ, తాళ్ల అజయ్, రవి నాయక్, సుమంత్, శ్రీనివాస్, అజయ్, భగత్, పవన్, అశ్వన్, రమేష్, కోటి, రుక్మత్ పాషా, వికాస్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు విరమించుకోవాలి

- బేషరతుగా రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలి
- ఆగస్టులోపు ఆరు గ్యారంటీలు అమలు చేయకపోతే ఆందోళనలు
- సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆగస్టు నుంచి రిజిస్ట్రేషన్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు కోరారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నున్నా మాట్లాడారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ విలువలు పెంచడం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు పడతాయని తెలిపారు. బేషరతుగా రూ.రెండు లక్షల రుణమాఫీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టులోపు ఆరు గ్యారెంటీలు అమలు కాకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, రైతులకు పెట్టుబడి చాలా అవసరమని, కౌలు రైతులకు, రైతులకు కొత్త రుణాలు అందజేయాలని, అలా అందజేయకపోతే, రైతులు ప్రయివేటు అప్పులకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందని, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రైతులను ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వం మారి ఏడు నెలలు కావస్తున్నా, పేదలకు, వృద్ధులకు ఆసరా పింఛను ఇవ్వలేదని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారు చెప్పినట్టుగా ఆసరా పెన్షన్లు అందిస్తున్నారని, తెలంగాణలోనూ ఆసరా పెన్షన్లు రూ. నాలుగు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప, మిగతావి ఏవి సక్రమంగా అమలు చేయలేయడం లేదన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు ఇస్తామని చెప్పినప్పటికీ అమలుకు నోచుకోలేదని, గృహజ్యోతి 200 యూనిట్లులోపు అని చెప్పినప్పటికీ అందరికీ అమలు కావడం లేదని, రూ.500కే గ్యాస్, మహాలక్ష్మి పథకంలో 18 సం.లు నిండిన ప్రతి పేద మహిళకు రూ.2,500.. ఇవి ఏవి అమలు కావడం లేదని తెలిపారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల స్థలాలు ఉన్న వారికి రూ.ఐదు లక్షలు, స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు గ్యారంటీ అమలుకు నోచుకోలేదన్నారు. 2007 నుంచి సిపిఎం ఇళ్ల స్థలాలపై ఎన్నో పోరాటాలు చేసిందని, ఇప్పటికీ ఇళ్ల స్థలాల పోరాటాలపై కోర్టు కేసులున్నాయని, ప్రభుత్వ స్థలాలున్నప్పటికీ, అధికారులు వారికి ఇవ్వడం లేదని, ఇళ్ల స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. రేషన్ కార్డులు గత ప్రభుత్వమూ ఇవ్వలేదని, ఈ ప్రభుత్వమైనా ఆగస్టులోపు రేషన్ కార్డులు ప్రతి పేదవాడికి అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. ఆగస్టులోపు కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన విధంగా గ్యారంటీలు అమలు చేయకపోతే సెప్టెంబర్‌లో ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జులై 10న కార్మికుల కోర్కెల దినం

- జిల్లా, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో ధర్నాలు
- కార్మికులంతా జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఐటియు అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా జులై పదో తేదీన కార్మికుల కోర్కెల దినాన్ని పాటించాలనీ, జిల్లా, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు, ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో సిఐటియు ఆఫీస్‌బేరర్ల సమావేశం జరిగింది. అనంతరం మీడియాతో చుక్కరాములు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర కోడ్‌ల అమలు, బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియలను వేగం చేసిందని విమర్శించారు. ఇపిఎఫ్ సకాలంలో చెల్లించని యాజమాన్యాలకు విధించే జరిమానాను భారీగా తగ్గించిందనీ, కార్పొరేట్ - మతోన్మాదులను ప్రసన్నం చేసుకొని వారికి లాభాలు కట్టబెట్టేందుకు నిశ్చయంగా ఉందని విమర్శించారు. ఈ విధానాలను నివారించి, కార్మిక హక్కులను కాపాడేందుకు దేశవ్యాప్తంగా కార్మిక పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ..ఎన్నికల్లో గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేయకముందే మతోన్మాద-కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు బిజెపి ప్రభుత్వం రంగంలోకి దిగిందని విమర్శించారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను లీజుకివ్వడం, అమ్మివేయడం, ప్రయివేటీకరించడం లాంటి వాటిని మరింత వేగవంతం చేస్తామని ప్రకటించడం దుర్మార్గమన్నారు. మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును బహిరంగ వేలంలో పెట్టడం దారుణమని చెప్పారు. కనీస వేతనం రూ.26 వేల అమలు, సమాన పనికి - సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పర్మినెంట్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ చెల్లింపు, ఓపిఎస్ రద్దు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు వంటి అంశాలపై మాత్రం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నోరు మెదపడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నదన్నారు. పరిశ్రమల యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గి 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు కొత్త జీఓలను విడుదల చేసిందనీ, ఆ జీఓలలో ఒక్క పైసా కూడా వేతనం పెంచలేదని విమర్శించారు. మోడీ ప్రభుత్వం జారీచేసిన ఆదేశాలను ఆశా వర్కర్లకు నష్టదాయకమనీ, బిజెపి పాలిత రాష్ట్రాలూ పరీక్షలు పెట్టకుండా నిరాకరించాయని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ పరిశ్రమలకు కార్మిక చట్టాల అమలు నుంచి మినహాయింపు ఇవ్వడం, నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తామని ప్రకటించడం, ఆశాలకు పరీక్షలు పెడతామనటం దారుణమని విమర్శించారు. సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, భూపాల్, ఎస్‌వి రమ, కె ఈశ్వర్‌రావు, పద్మశ్రీ, రాష్ట్ర కార్యదర్శులు జె వెంకటేష్, కూరపాటి రమేష్ పాల్గొన్నారు.

అవినీతిపరులను కఠినంగా శిక్షించాలి

- మేడిగడ్డపై ప్రొఫెసర్ కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంజనీర్ల సూచనలను పట్టించుకోని గత బిఆర్ఎస్ ప్రభుత్వం మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ ఒకలా, నిర్మాణం మరోలా చేయడంతోనే బ్యారేజీ కుంగిందని టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ విమర్శించారు. ఆ ప్రాజెక్టులో అవినీతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని టిజెఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ ప్రాజెక్ట్‌కు సంబంధించి వాస్తవాలు ప్రజలకు తెలియకుండా కెసిఆర్ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రాజెక్టు నిర్మించడం సరికాదని ఇంజనీర్లు సూచించినప్పటికీ అక్కడే నిర్మించిందని గుర్తు చేశారు. దానికి సంబంధించిన ఆర్థికపరమైన అంశాల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని కాగ్ తప్పుపట్టిందని కోదండరామ్ వివరించారు. ప్రాజెక్టు నిర్మాణ మెటీరియల్ సక్రమంగా లేదని, నిర్వహణ కూడా సరిగ్గా లేదని డ్యామ్ సేఫ్టీ అధికారులు తమ నివేదికలో చెప్పారని తెలిపారు. బొగ్గు గనులను వేలం ప్రయివేటీకరణకు దారి తీస్తుందని, వాటిని సింగరేణికే అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాళేశ్వరంలో జరిగిన అవినీతి అక్రమాలపై జస్టిస్ ఘోష్ కమిషన్‌కు తాము రెండు సార్లు పూర్తి సమాచారంతో నివేదికను సమర్పించినట్టు తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద ఇప్పటికే రూ.800 కోట్ల ఖర్చుతో కాలువ పనులను చేపట్టారనీ, ఇక్కడి నుంచి నీటిని తీసుకునే అవకాశాన్ని పరిశీలించాలని కమిషన్ ను కోరినట్టు కోదండరామ్ వివరించారు. మీడియా సమావేశంలో టిజెఎస్ నాయకులు ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వరరావు, బైరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అలైడ్ హెల్త్ సైన్స్ మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి
- హెల్త్ యూనివర్సిటీ అధికారులపై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అలైడ్ హెల్త్ సైన్స్ మెడికల్ కోర్సు చదివే విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎల్.మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సంబంధిత విద్యార్థులు తమకు న్యాయం చేయాలంటూ నగరంలోని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆర్.ఎల్.మూర్తి వారితో సమస్యలపై మాట్లాడారు. అనంతరం అక్కడ రోడ్డుపై విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం తొమ్మిది కళాశాలల్లో 800 మంది విద్యార్థులు చదువుతున్నారని, గాంధీ, ఉస్మానియా, కెఎంసి వరంగల్, అదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సూర్యాపేట, సిద్దిపేట, నల్లగొండ కాలేజ్‌ల విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఈ విద్యార్థులకు ఇప్పటికీ సరైన కోర్సు సిలబస్ లేదన్నారు. ఈ నెలలో విడుదలైన మొదటి సంవత్సరం ఫలితాల్లో సుమారు 97 శాతం మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం పూర్తయినా ఇప్పటికీ సరైన సిలబస్.. లెక్చరర్స్ లేకపోవడంతోనే ఎక్కు మంది ఫెయిల్ అయినట్టు విద్యార్థులు తెలిపారని చెప్పారు. సాధారణంగా 80 శాతం థియరీ పరీక్షలో.. 40 శాతం మార్కులు వస్తే పాస్ అయినట్టు.. వీళ్లకు మాత్రం 50 శాతం మార్కులు వస్తేనే పాస్ అనే నిబంధన పెట్టారన్నారు. వెంటనే ఈ నిబంధన ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్‌లో టాప్ మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇక్కడ ఫెయిలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేస్ మార్కులు ఇచ్చి విద్యార్థులందరినీ పాస్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ అకడమిక్ ఇయర్ లేకపోవడం దారుణమన్నారు. విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా కల్పించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సౌకర్యాలు పొందడానికి విద్యార్థులకు అప్లై చేసుకునే అవకాశం లేదన్నారు. దాంతో పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తక్షణమే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే అవకాశాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెల్త్ యూనివర్సిటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, నాయకులు శ్రీను, రఘు తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్యం అప్పుడు గుర్తుకు రాలేదా?

- కెటిఆర్‌కు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్న

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యం, అన్యాయం, అక్రమం అనే పదాలు...అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకు రాలేదా? అంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాజీ మంత్రి కెటిఆర్‌ను ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులపై కేటీఆర్ మొసలి కన్నీరు కార్చుతున్నారని ఎద్దేవా చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ మీడియాపాయింట్‌లో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాగూర్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. టిడిపి ఎమ్మెల్యే తలసానిని బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా చేసినప్పుడు కేసీఆర్‌ను ఎందుకు నిలదీయలేదని ప్రశ్నించారు. 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకున్నప్పుడు ప్రజాస్వామ్య విలువలు ఎటు పోయాయయని నిలదీశారు. పార్టీ ఎమ్మెల్యేలకు కేసీఆర్ తన ఫామ్ హౌస్‌లో వీడ్కోలు పార్టీ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. సిఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాలకు ఆకర్షితులై బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని వివరించారు. బిఆర్ఎస్‌లో మిగిలేది ఆ నలుగురు మాత్రమేనన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వివాదం తమ పార్టీ అంతర్గత విషయమన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆయనకు సముచిత గౌరవం ఇస్తారని చెప్పారు.

నీటి పొదుపుతో ఎక్కువ సాగు చేయాలి

- ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నీటిని పొదుపు చేయడం ద్వారా ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి సూచించారు. హైదరాబాద్ హిమయత్‌సాగర్‌లోని నీరు, భూ యాజమాన్య శిక్షణ, పరిశోధన సంస్థను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ నరేందర్, ఇతర అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని నీటి పొదుపుగా వాడుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.

చొప్పదండి ఎమ్మెల్యేకు కెటిఆర్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను ఎమ్మెల్యే కెటిఆర్ పరామర్శించారు. ఇటీవల సత్యం సతీమణి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్‌లోని ఎమ్మెల్యే సత్యం నివాసానికి వెళ్లారు. సత్యం భార్య రూపాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యేను ఓదార్చారు. కెటిఆర్ వెంట కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేక్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పార్టీ సీనియర్ నాయకులు ఉన్నారు.

NATIONAL COLLEGE OF EDUCATION
(Affiliated to OU)
Munidevunipally (V), Kondapur (M), Sangareddy Dist - 502001. T.S.
Required
Psychology Lecturer
as per the norms of Osmania University
Send your Resume
90103 33365

IN THE COURT OF THE II ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI
O.S.NO. 15/2018
Between:-
Smt. Edula Bharathi @ Challa Chandramma. ...PLAINTIFF
Vs
Challa Yerri Swamy & 4 others. ...DEFENDANTS
TO
D2) Smt. Lavanya w/o Rajesh
D/O Yerri Swamy R/O H.No. 5-39,
Shankar Nagar, Uppal, Hyderabad.
The abovenamed Plaintiff filed the above suit against you and four others for Partition and separate possession of her half share in the suit schedule lands. You are hereby summoned to appear before this Hon'ble Court on 12.07.2024 at 10.30 A.M. in person or through Pleader to file your claim objections failing which the matter will be decided and determined in your absence.
A.M.JANARDHAN GOUD
S.VENKATA REDDY &
A.LAKSHMI NARAYANA
ADVOCATES, KURNOOL/ADONI

జనరల్ నోటీసు
IN THE COURT OF THE PRL. CIVIL JUDGE(SENIOR DIVISION):GUNTUR
S.O.P. No. 27 / 2024
Between :
1)Shaik Sultana,W/o.Salam,2)Shaik Shameer Basha, S/o. Salam,3)Shaik Shahid,S/o. Salam,The Petitioners 2 & 3 are being minors rep. by their mother/natural Guardian i.e., 1st Petitioner, Shaik Sultana, W/o. Salam. All are R/o. Door No. 32-8-426, 7th line, Vallurivari Thota, Guntur East, Guntur Dist. .... Petitioners
and
1)The Commissioner, Employment Provident Fund Office, O/o. Regional Office, 2nd floor, Bhavishya nidhi Bhavan, Near Y Junction, behind TSRTC, Prasanthi Nagar, Kukatpalli, Hyderabad, Telangana State - 500 018.
2)Shaik Beebi Jan, W/o. Moulali,R/o. D.No.6-30-123 /8B, 10/5 Lane, Arundal Peta, Guntur City, Guntur District. ....Respondents
పై నెంబరు పిటీషన్‌లో పిటీషనర్లు లేటు షేక్ సలామ్ యొక్క డెత్ బెనిఫిట్స్ అయిన ప్రావిడెంట్ ఫండ్ వగైరాలు 1వ రెస్పాండెంట్ వారి వద్ద నుండి పొందుటకు **Succession Certificate** యిప్పించమని పైకోర్టులో పిటిషను దాఖలు చేయగా జనరల్ నోటీసు నిమిత్తం **ది.31-07-2024**కి వాయిదావేసినారు. కావున ఈపిటీషనులో ఎవరికైన అభ్యంతరములు ఉన్నయెడల వాయిదా రోజున ఉ॥గం॥10-30ని॥లకు హాజరై వారియొక్క ఆక్షేపణలు తెలియపరచవలెను. లేనిచో మీ పరోక్షంగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.
వాయిదాతేది : 31-07-2024.
వేముల జయపాల్, జవ్వాది శ్రీనివాసరావు
పిటీషనర్ల తరపు అడ్వకేట్స్, గుంటూరు.

WE ARE HIRING
MAA Institute of Speech And Hearing (MAA Research Foundation) is inviting applications for the following posts.
MAA INSTITUTE OF SPEECH & HEARING
AFFILIATED TO OSMANIA UNIVERSITY & RECOGNIZED BY REHABILITATION COUNCIL OF INDIA
EDUCATE • EMPOWER • ENLIGHTEN

S.No	Designation	Eligibility	Requirement
1	Assistant Professor Psychology	M.Sc. (Psychology) / M.Phil. (Psychology) with 2 years' experience	01
2	Assistant Professor Physiotherapy	B.Sc. / M.Sc. in Physiotherapy with 2 years' experience	01
3	Assistant Professor Special Education	MA / M.Com / M.Sc. with B.Ed. in Special Education, 2 years' experience	01
4	Assistant Professor Speech Language Pathology	MASLP with 2 years' experience	01

Kindly send your resume to hr@maaent.com or Call Us 8886689909, 9100072758
H.No. 8-2-293/82/A/1266, Road No.36, Jubilee Hills, Hyderabad - 500 033.
PH: +91 9100-072-758 | admin@mish.co.in | www.mish.co.in

పంట రుణాల పేర.. ఖాతాలు హోల్డ్

- రైతుల చేతికందని పింఛను, పిఎం కిసాన్, జొన్నల డబ్బులు
- ఖాతాల్ని హోల్డ్ చేయొద్దని లీడ్ బ్యాంక్ ఆదేశాలు
- బ్యాంకర్ల బేఖాతర్.. పంట రుణాల వసూళ్ల కోసం రైతులపై ఒత్తిడి
- కట్టొద్దన్న సిఎం రేవంత్‌రెడ్డి

వట్‌పల్లి మండలంలో 700 ఖాతాలు హోల్డ్

ఫింఛన్, పిఎం కిసాన్, జొన్నల డబ్బులకు బ్రేక్

ప్రజాశక్తి – హైదరాబాద్

'నా పేరు నర్సింహారెడ్డి. మాది వట్‌పల్లి మండలం గొర్రెకల్. మంజీరా వికాస బ్యాంకులో రూ.రెండు లక్షల పంట రుణం ఉంది. ప్రభుత్వం రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడంతో అప్పు కట్టలేదు. అందుకని నా ఖాతాను హోల్డ్‌లో పెట్టారు. నాకు ప్రభుత్వం నుంచి నెల నెలా వచ్చే పింఛన్ డబ్బులు నా ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఈ నెల 18న పిఎం కిసాన్ డబ్బులు రూ. రెండు వేలు పడ్డాయి. యాసంగిలో పండించిన 30 క్వింటాళ్ల జొన్నల్ని మార్క్‌ఫెడ్ సంస్థకు విక్రయించాను. క్వింటాల్‌కు రూ.3180 చొప్పున ఖాతాలో రూ.95400 జమయయ్యాయి. ఇలా నా ఖాతాలో డబ్బులు జమ అవ్వడం తప్ప వాటిని విత్‌డ్రా చేసుకునే పరిస్థితి లేదు. నా డబ్బులు నేను వాడుకునే వీల్లేకుండా చేశారు. ఎన్ని సార్లు బ్యాంకు చుట్టు తిరిగినా పట్టించుకోవట్లేదు. అవసరాలకు డబ్బుల్లేక తిప్పలు పడుతున్నం'

'నా పేరు నిర్మలబాయి. మాది వట్‌పల్లి మండలంలోని లక్యానాయక్ తండా. వట్‌పల్లి మంజీరా వికాస బ్యాంకులో ఖాతా ఉంది. పొలం మీద పంట రుణం తెచ్చుకున్నాం. మాఫీ చేస్తరని చెప్పడంతో కట్టలేదు. అదే బ్యాంకులో బంగారం మీద రూ. రెండు లక్షల అప్పు తెచ్చుకున్నాం. అప్పుకు వడ్డీ కట్టేందుకు బ్యాంకు వెళ్లిన. పంట అప్పు చెల్లిస్తేనే బంగారం అప్పుకు వడ్డీ కట్టుకుంట అని మేనేజర్ చెబుతుండు. పంట రుణం మాఫీ అవుతదని కట్టలేదు. లేకుంటే చెల్లించే వాళ్లం. ఖాతాను హోల్డ్‌లో పెట్టడం వల్ల బంగారం లోన్‌పై వడ్డీ భారం పడుతుంది' ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టిన సమస్య వీరిద్దరిదే కాదు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అనేక బ్యాంకుల్లోని రైతుల పరిస్థితి ఇదే.

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని మంజరీ వికాస బ్యాంకు, ఎస్‌బిఐ, గ్రామీణ వికాస బ్యాంకులున్నాయి. వట్‌పల్లిలోని మంజీరా బ్యాంకులో తొమ్మిది గ్రామాలకు చెందిన రెండు వేల ఖాతాలుండగా 1200 మందికిపైగానే రైతులు పంట రుణాలు పొందారు. వీరిలో కొందరు అప్పు చెల్లించడం, వడ్డీ కట్టి రెన్యూవల్ చేసుకుంటున్నారు. ప్రభుత్వమే అసలు, వడ్డీ కలిపి రూ. రెండు లక్షలు మాఫీ చేస్తామని చెప్పడంతో చాలా మంది రైతులు పంట రుణాలు కట్టలేదు. బ్యాంక్ మేనేజర్ జనార్ధన్ మాత్రం అప్పులు వసూలు చేయడం కోసం 700 మంది రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టి తిప్పలు పెడుతున్నారు. రైతుల్లో చేయూత ఫింఛన్‌దారులున్నారు. వీరికి నెలకు రూ.2016 బ్యాంక్ ఖాతాలో పడుతున్నాయి. జొన్నలు అమ్మిన పైసలు, పిఎం కిసాన్ డబ్బులు కూడా విత్‌డ్రా చేసే వీల్లేదు. రైతులు బ్యాంకుకు వెళ్లి అడిగితే మేనేజర్ అదంతే.. అప్పు కట్టాల్సిందే అంటూ బెదిరిస్తున్నారు. రైతులంతా మండల వ్యవసాయ అధికారి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

ఎఒ బ్యాంకుకు వెళ్లి లీడ్ బ్యాంక్ సర్క్యులర్ చూపినా పట్టించుకోవట్లేదు. మండలంలోని ఎస్‌బిఐ, గ్రామీణ వికాస బ్యాంకు సైతం రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు.

రైతులకు ఆగస్టు 15లోపు రూ. రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మరో పక్క బ్యాంకర్లు మాత్రం రైతుల ముక్కుపిండి అప్పులు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ బ్యాంకర్లు పంట రుణాల వసూళ్ల పేరిట రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టారు. ఖాతాలో డబ్బులు జమ కావడం తప్ప విత్‌డ్రా చేసేందుకు వీల్లేకుండా చేశారు. అయితే రైతుల్లో కొంత మందికి చేయూత ఫింఛన్, పిఎం కిసాన్, పంట డబ్బులు వారి ఖాతాల్లో పడుతున్నా వాటిని తీసుకోలేకపోతున్నారు. చాలా మందికి అవి కూడా నిలిచిపోయాయి. తమకు డబ్బులివ్వాల్సిన వాళ్లు ఖాతాలో వేస్తే కూడా ఆగిపోతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట, కొండాపూర్, కంది, సంగారెడ్డి, పుల్కల్, వట్‌పల్లి, రాయికోడ్, మనూరు, కంగ్టి, మునిపల్లి, కోహీర్, జహీరాబాద్, నారాయణఖేడ్ వంటి మండలాల్లో రైతుల ఖాతాలు చాలా వరకు హోల్డ్‌లో పడ్డాయి. యాసంగి సీజన్‌లో పండిన జొన్నల్ని మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా జిల్లాలో 19 కొనుగోలు కేంద్రాలు పెట్టి 2.18 లక్షల క్వింటాళ్ల జొన్నల్ని కొనుగోలు చేశారు. రూ.69.37 కోట్ల విలువ చేసే జొన్నల్ని కొన్న మార్క్‌ఫెడ్ సంస్థ ఇప్పటికే రూ.40 కోట్ల వరకు రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టడం వల్ల జొన్నల డబ్బులు సైతం చేతికందలేదు.

ఖరీఫ్ పెట్టుబడి.. పిల్లల ఫీజులు

రైతులకు రావాల్సిన డబ్బులన్నీ బ్యాంక్ ఖాతాలోనే మగ్గిపోతుండడంతో కనీస అవసరాలు తీర్చుకోలేకపోతున్నారు. మంజీరా వికాస బ్యాంకు, ఎస్‌బిఐ, గ్రామీణ వికాస బ్యాంకు, డిసిసిబి వంటి బ్యాంకుల్లో రైతుల చెల్లించాల్సిన పంట రుణాల్ని వసూలు చేసేందుకు ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టారు. దాంతో ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం విత్తనాలు, ఎరువులు, దున్నకం ఖర్చులకు చేతిలో డబ్బుల్లేక రైతులు అప్పులు చేస్తున్నారు. పత్తి విత్తనాల్ని రెండో సారి విత్తుకోవాల్సి వస్తుండటంతో డబ్బుల కోసం అల్లాడు తున్నారు. మరో పక్క జూన్‌లో స్కూల్స్, కళాశాలు ప్రారంభ మయ్యే సరికి పిల్లల ఫీజులు, పుస్తకాలు, ఇతర ఖర్చులనూ రైతు కుటుంబాలు చేతిలో డబ్బుల్లేక.. బ్యాంకులో ఉన్న డబ్బులు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నాయి.

ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టొద్దని లీడ్ బ్యాంక్ ఆదేశాలు

పంట రుణాల్ని సకాలంలో చెల్లించని రైతుల ఖాతాల్ని బ్యాంకర్లు హోల్డ్‌లో పెట్టి అప్పు వసూలు చేస్తున్నారు. బ్యాంకర్ల నిర్ణయం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో లీడ్ బ్యాంక్ జోక్యం చేసుకుంది. పంట రుణాల వసూలు కోసం రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టకూడదంటూ అన్ని రకాల బ్యాంకర్లకు లీడ్ బ్యాంక్ నుంచి ఆదేశాలు జారీ చేశారు. సదరు కాపీని ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్, ఇతర బ్యాంకులన్నింటికీ పంపారు. అయినా బ్యాంకు మేనేజర్లు అప్పుల రికవరీ టార్గెట్‌ను చేరుకోవడం కోసం రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టి అందులో జమైన డబ్బుల్ని అప్పు కింద కట్టించుకుంటున్నారు. వ్యవసాయ అధికారులు లీడ్ బ్యాంకు ఆదేశాల్ని పాటించాలని చెబుతున్నా ఫలితముండట్లేదు.

రైతు ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టొద్దు: ఎ మాణిక్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు

రైతుల ఖాతాల్ని హోల్డ్‌లో పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న బ్యాంకర్లపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం 2018 డిసెంబర్ నుంచి 2023 వరకు ఉన్న రూ. రెండు లక్షల పంట రుణాల్ని మాఫీ చేస్తామంటుంది. ఎన్నికలప్పుడే రుణాల్ని ఎవరూ కట్టొద్దని చెప్పారు. అందుకే రైతులు చెల్లించలేదు. బ్యాంకర్లు మాత్రం హోల్డ్‌లో పెట్టి ఫించన్ డబ్బులు, జొన్నలమ్మిన డబ్బులు, పిఎం కిసాన్ డబ్బుల్ని ఆపారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని రైతుల సమస్యను పరిష్కరించాలి.

నిరసన తెలుపుతున్న రైతులు

త్రిబుల్ ఆర్ రోడ్డుకు భూములివ్వం

- గజ్వేల్‌లో మర్కుక్ మండల రైతుల నిరసన

ప్రజాశక్తి– హైదరాబాద్

త్రిబుల్ ఆర్ రోడ్ నిర్మాణం నిలిపివేయాలని రైతులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికే కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల కాలువలకు భూములు కోల్పోయి రోడ్డున పడ్డామని, ఇప్పుడు రింగ్ రోడ్డు కోసమంటూ మళ్లీ తమ భూములను ఇవ్వాలనడం సరికాదని మర్కుక్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ప్లకార్డ్స్ పట్టుకుని నిరసన చేపడుతూ రీజనల్ రింగ్ రోడ్డుకు భూములు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం మూలంగా భూములు కోల్పోయి నిరాశ్రయులయ్యామని, ప్రస్తుతం ఈ ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు పేరిట భూములను తీసుకునేందుకు ప్రయత్నాలు చేయడం విరమించుకోవాలన్నారు. ఎకరం భూమి రెండు మూడు కోట్లు ధర పలుకుతుండగా ప్రభుత్వం లక్షల్లో పరిహారం చెల్లిస్తే ఎలా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు వేయడం మానుకోవాలని డిమాండ్ చేశారు.

పింఛన్ల పెంపు ఇంకెప్పుడు?

- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అడివయ్య
- రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- ఆగస్టు 24,25,26 తేదీల్లో 'వేదిక' రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ఆసరా పెన్షన్, చేయూత పెన్షన్‌ను ఇంకెప్పుడు పెంచుతారని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర అధ్యక్ష ప్రధానకార్యదర్శులు వెంకట్, అడివయ్య అన్నారు. హామీనిచ్చి 6 నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయం ఊసే ఎత్తడం లేదన్నారు. పెన్షన్ పెంపు అమలు కోసం ఉద్యమానికి ఆసరా, చేయూత లబ్దిదారులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇసిఐఎల్ కమలానగర్‌లోని భాస్కర్‌రావు భవన్‌లో ఎన్‌పిఆర్‌డి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సమావేశం జిల్లా అధ్యక్షులు ఎ రంగారెడ్డి అధ్యక్షతన జరిగింది. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఆసరా పెన్షన్, చేయూత పెన్షన్‌ను రూ. నాలుగు వేలు, రూ. ఆరు వేలకు పెంచుతామని హామీనిచ్చినట్టు తెలిపారు. 2024 జనవరి నుంచే ఆసరా, చేయూత పెన్షన్ పథకాన్ని అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి స్పందనా లేదన్నారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా పెన్షన్స్ కోసం సుమారు 24.84 లక్షల మంది కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వం గతంలో ప్రకటించినట్టు గుర్తు చేశారు. ప్రతి నెలా చివరి వారంలో పింఛన్ డబ్బులు చెల్లించడం వల్ల లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. 2014 నుంచి ప్రతి ఏడాదీ రెండు, మూడు నెలల పింఛన్ పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. పెండింగ్‌లో లేకుండా రెగ్యులర్‌గా పింఛన్లు చెల్లించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పెంచాల్సిన పింఛన్లు కూడా జనవరి నుంచే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. జులై పింఛన్‌తోపాటు పెరిగిందీ ఇవ్వాలని, జనవరి నుంచి జూన్ వరకు ఏరియర్స్ కలపాలని అన్నారు. వెంటనే పింఛన్లు పెంచి ఇవ్వాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర 4వ మహాసభ ఆగస్టు 24–26 తేదీల్లో గ్రేటర్ హైదరాబాద్ నగరంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మహాసభకు 33 జిల్లాల నుంచి 700 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. మహాసభ నిర్వహణ కోసం ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు జి.బాలయ్య, జె.మల్లేష్, షాయినా బేగం, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి, సుల్తాన్ రమేష్, విజయలక్ష్మి, చంద్రమోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల రీడింగ్‌పై అపోహలొద్దు

- టిజిఎస్‌పిడిసిఎల్ ఎండి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో విద్యుత్ బిల్లుల రీడింగ్‌పై అపోహలొద్దని దక్షిణ తెలంగాణ పంపిణి సంస్థ (టిజిఎస్‌పిడిసిఎల్) మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మీటర్ రీడింగ్ తీయాల్సినప్పటికీ, కొన్ని సందర్భాల్లో రెండు, మూడు రోజులు ఆలస్యంగా తీస్తున్నారని తెలిపారు. దీని వల్ల ఆ నెలలో వినియోగించిన యూనిట్లు పెరిగి స్లాబ్ రేటు మారడంతో అధిక బిల్లులు వస్తున్నాయనే ప్రచారం సరికాదన్నారు. 99.5 శాతం బిల్లులు నెల రోజులకే ఇస్తున్నామనీ, అనివార్య పరిస్థితుల్లో ఆలస్యం జరిగితే వినియోగదారులు నష్టపోవద్దనే ఉద్దేశంతో తగిన ఏర్పాట్లు చేసినట్టు వివరించారు. రీడింగ్ తీసిన రోజులతో సంబంధం లేకుండా కేవలం నెల రోజులకే బిల్లులు జారీ చేసేలా స్పాట్ బిల్లింగ్ మెషిన్‌లో తగిన ఏర్పాట్లు చేసామని పేర్కొన్నారు. గృహ వినియోగదారుల విద్యుత్ వాడకం బిల్లులకు సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకునేందుకు టిజిఎస్‌పిడిసిఎల్ వెబ్‌సైట్లో " ఎనర్జీ చార్జెస్ క్యాలిక్యులేటర్ ఫర్ డొమెస్టిక్ సర్వీసెస్" అనే సేవలను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. ఈ సమాచారాన్ని మొబైల్ యాప్‌లో కూడా చూసుకోవచ్చని వినియోగదారులకు సూచించారు.

దళిత మైనర్ బాలుడిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

జామకాయలు తెంపుకున్నాడనే నెపంతో రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కేసారం గ్రామంలో ఏడవ తరగతి చదువుతున్న దళిత మైనర్ బాలుడు బ్యాగరి యాదగిరి (12)పై దాడి చేసిన మధుసూదన్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం ఈమేరకు ఇదే అంశంపై వారొక ప్రకటన విడుదల చేశారు. బాలుణ్ని తాళ్లతో కట్టేసి, కాళ్లతో తన్ని కులం పేరుతో దూషించిన ఆ గ్రామ పెత్తందారు రిటైర్డ్ ఉపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డిని, అతని కుమారుడిని తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ కు పంపాలని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను కోరారు. ఆ దౌర్జన్యం వెనుక కులవివక్ష, అంటరానితనం దాగి ఉన్నాయని తెలిపారు. దళితుడు తమ చెట్టును ముట్టుకోవడమేంటనే అగ్రకుల దురహంకారాన్ని ప్రదర్శించారని విమర్శించారు. ఈ ఘటనకు పాల్పడిన తండ్రీ, కొడుకులను తక్షణమే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపకపోతే సామాజిక ప్రజా సంఘాలు ప్రతిఘటిస్తాయని వారు హెచ్చరించారు.

చెంచు మహిళ కుటుంబానికి రక్షణ

- డ్రగ్స్ నివారణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి సీతక్క
- నిమ్స్‌లో బాధితురాలికి పరామర్శ

ప్రజాశక్తి–హైదరాబాద్

నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొల్లాపూర్‌కు చెందిన చెంచు మహిళ ఈశ్వరమ్మను బుధవారం మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పరామర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఈశ్వరమ్మకు మెరుగైన చికిత్సలు అందిస్తున్నా మని, ఆమె కుటుంబానికి సంపూర్ణ రక్షణ కల్పిస్తామని తెలిపారు. దోషులు ఎంతటి వారైనా వదిలేదిలేదని, ఇప్పటికే పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. నాగరిక సమాజంలో అనాగరిక చర్యలకు పాల్పడే ఎవరినీ వదలబోమని హెచ్చరించారు. తమ ప్రభుత్వంలో ఫ్రెండ్లీ పోలీసులు.. బాధితుల పక్షానే ఉంటూ నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరి స్తారని తెలిపారు. ఇప్పటికే ఈశ్వరమ్మ కుటుంబానికి ఐటిడిఎ, ఎస్‌సి, ఎస్‌టి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ శాఖల తరపున ఆర్థిక సాయం అందజేశామన్నారు. బాధితురాలు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందన్నారు. అదేవిధంగా.. వారి

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న మంత్రి సీతక్క

కుటుంబంలో ఓ వ్యక్తి కూడా అనుమానాస్పదంగా మృతి చెందినట్టు బాధితులు తెలపగా.. సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. అలాగే తమ ప్రభుత్వం డ్రగ్స్‌పై కఠినంగా వ్యవహరిస్తోందని, డ్రగ్స్ సేవించి మహిళలపై చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని శిక్షిస్తామని తెలిపారు. మంత్రి వెంట నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, సూపరింటెండెంట్ సత్యనారాయణ, ఇతర వైద్యులు, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారులు, పిడబ్ల్యుఒ సంధ్య, ఇతర మహిళ సంఘాల ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

ఐటిఐఆర్ మంజూరు చేయాల్సిందే!

- కేంద్ర మంత్రులకు జగ్గారెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వంతో ఐటిఐఆర్‌ను వెంటనే మంజూరు చేయించాలని టిపిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లను డిమాండ్ చేశారు. అప్పటివరకు తాను మాట్లాడుతూనే ఉంటాన న్నారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. యుపిఎ ప్రభుత్వం ఐటిఐఆర్‌ను మంజూరు చేసినప్పుడు ఎంపి రఘునందన్‌రావు టిఆర్ఎస్‌లో ఉన్నారని గుర్తు చేశారు. 1980లో రాజకీయంగా బిజెపికి పెద్దగా గుర్తింపులేదని, ఆ పార్టీలో ఉన్నప్పటికీ తాను కష్టపడి రాజకీయంగా ఎదిగానన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే తామే ఐటిఐఆర్‌ను మంజూరు చేయించేవారమని వ్యాఖ్యానించారు. రఘునందన్‌రావు న్యాయవాది, చాలా పుస్తకాలు చదివాడనీ, కానీ తాను జీవితాన్ని చదివానని చెప్పారు. మరోసారి తన జోలికొస్తే మంచిగా ఉండదని హెచ్చరించారు.

విద్యార్థుల సమస్యలపై పోరాటం

- యూనివర్సిటీని సెంట్రల్ జైలుగా మార్చారు
- విద్యార్థుల ఆందోళనలో హతిక్ అహ్మద్

ప్రజాశక్తి – హైదరాబాద్

విద్యార్థుల సమస్యలపై పోరాటానికి వెనక్కి తగ్గేది లేదని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షులు హతిక్ అహ్మద్ స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతున్న తమపై సస్పెండ్‌ను వ్యతిరేకిస్తూ మూడ్రోజులుగా నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా బుధవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదుట నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలకు యూనివర్సిటీ అడ్డాగా మారిందని, వారు ఏది చెబితే ఇక్కడ అదే జరుగుతుందని, అందులో భాగంగానే తమ మీద కేసులు, వెలివేతలు జరుగుతున్నాయని ఆరోపించారు. అడ్మినిస్ట్రేషన్ అక్రమాలను ప్రశ్నిస్తున్న తమను టార్గెట్ చేసి కేసులు పెడుతున్నారని, వాక్ స్వాతంత్రాన్ని కాలరాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోహిత్ వేముల మరణం తర్వాత మరోసారి ఇక్కడ వెలివాడ వెలిసిందని, హెచ్‌సియు విద్యార్థుల హక్కుల కోసం ప్రశ్నిస్తున్న తమను వెలివేస్తున్నారని, రోహిత్ వేముల లాగానే తమపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. తమ హక్కుల కోసం పోరాడతామని స్పష్టం చేశారు. యూనివర్సిటీ ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి కృపా మరియా మాట్లాడుతూ.. ఎబివిపి విద్యార్థి సంఘం నాయకుల ఒత్తిడి వల్లే ఆమెపై కేసులు నమోదు చేశారని, విద్యార్థుల హక్కులపై విసిని అడగడం తప్పా అని ప్రశ్నించారు. హెచ్‌సియు, ఎస్ఎస్‌యుఐ ప్రెసిడెంట్ ధీరజ్ మాట్లాడుతూ.. సుకూన్ యానవల్ ఫెస్టివల్ నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తే విద్యార్థి నాయకులను సస్పెండ్ చేశారని, కానీ ఎబివిపి ఆధ్వర్యంలో ఫెస్టివల్ చేస్తే విసి వారికి అన్ని విధాలా సహకరించారని, ఎబివిపికి ఓ న్యాయం.. మిగతా విద్యార్థి సంఘాలకు ఓ న్యాయమా అని ప్రశ్నించారు. 50 మంది ఎబివిపి కార్యకర్తలు వచ్చి విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా ఎవరూ పట్టించుకోలేదని, కానీ శాంతియుతంగా ఫెస్ట్ చేసుకునేందుకు అనుమతులు అడిగిన విద్యార్థులపై కేసులు పెట్టి సస్పెండ్ చేయడం సిగ్గుచేటని అన్నారు. విసి, బిజెపి దాని అనుబంధ సంఘాల ఒత్తిడి మేరకే పనిచేస్తున్నా రని, పక్షపాత వైఖరి వల్ల విద్యార్థులు నష్టపోతున్నారని తెలిపారు. వీసీని వెంటనే తొలగించాలని, అలాగే నీట్‌లో ఉన్న మెంబర్స్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల సస్పెండ్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఎవాస్ కొత్త ప్రచార క్యాంపెయిన్

ముంబయి : ప్రముఖ నిర్మాణ సామగ్రి కంపెనీ అయిన ఇన్‌ఫ్రా.మార్కెట్ తన డైరెక్ట్–టు–కన్సూమర్ (డి2సి) బ్రాండ్ ఎవాస్ ద్వారా కొత్త 'ఘర్ ధడక్నె దో' కాంపెయిన్ ప్రారంభించినట్టు ప్రకటించింది. గృహిణులు వారి జీవిత కాలంలో ఎక్కువగా ఇంటిలోనే గడుపుతారన్న విషయాన్ని ఎవాస్ గుర్తిస్తోందని పేర్కొంది. గుండెల నిండా ఆప్యాయతతో వారు వారి ఇళ్లని తమ పిల్లల్లా, కుటుంబ సభ్యునిలా చూసుకుంటారని.. ఈ క్రమంలోనే ఇళ్ళని మెరుగుపరుచుకోడాన్ని ప్రోత్సహించేలా ఎవాస్ క్యాంపెయిన్ ఉంటుందని ఇన్ఫ్రా.మార్కెట్ సహ వ్యవస్థాపకులు ఆదిత్య శర్మ పేర్కొన్నారు.

అపిటోరియం ఫార్మాలో కార్మికుడు మృతి

ప్రజాశక్తి – హైదరాబాద్

పరిశ్రమలో విధి నిర్వహణలో ఉన్న ఓ కార్మికుడు ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని అపిటోరియా యూనిట్–9 పరిశ్రమలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా కోదాడకు చెందిన కిరణ్ (37) కొంతకాలంగా ఆపిటోరియా యూనిట్–9 పరిశ్రమలో కెమిస్ట్రీగా విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం మొదటి షిఫ్ట్ విధులకు హాజరై పని చేస్తుండగా.. ఉన్నట్టుండి స్పృహతప్పి ఒక్కసారిగా కుప్పకూలాడు. గమనించిన తోటి కార్మికులు అతడిని వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

యువ రైతు ఆత్మహత్యాయత్నం

- తమ భూమి ధరణిలో నమోదు కాలేదంటూ తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఘటన
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యం
- ప్రభుత్వం, అధికారులు స్పందించి న్యాయం చేయాలి
- బాధిత రైతు కుటుంబసభ్యులు

ప్రజాశక్తి–హైదరాబాద్ బ్యూరో

తహశీల్దార్ తమకు అన్యాయం చేస్తోందని, ఎన్నిసార్లు కార్యాలయానికి వచ్చి తమ సమస్యను మొరపెట్టుకున్నా ఫలితం లేదని మనస్తాపానికి గురైన యువ రైతు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో బుధవారం కలకలం రేపింది. పోలీసులు, స్థానికులు స్పందించి ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కమలమ్మ లక్ష్మయ్య కొడుకు సురేష్ బాబు మాట్లాడుతూ.. మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన చెన్నకేశి మల్లమ్మ–లక్ష్మయ్య దంపతుల పేరు మీద ఘాన్సీనియాగూడ గ్రామ రెవెన్యూలోని సర్వే నెంబర్లు 4/7, 4/8లో సుమారు ఎనిమిది ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ధరణిలో మిస్సింగ్ నెంబర్‌గా నమోదు చూపిస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తల్లిదండ్రుల పేరుమీద ఉన్న భూమి ధరణిలో నమోదు కాకపోవడం వల్ల రైతుబంధుతో పాటు రైతుకు సంబంధించిన అన్ని రకాల హక్కులు కోల్పోయామని ఆందోళన వ్యక్తం చేశారు. మిస్సింగ్ నెంబర్ తిరిగి ధరణిలో చేర్చి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని తహశీల్దార్ కార్యాలయంలో పది అక్టోబర్ 2023న తన తల్లిదండ్రులు దరఖాస్తు అందజేసినట్టు చెప్పారు. ఆర్డీవో, కలెక్టర్‌కు కూడా దరఖాస్తు చేశామని, సమస్య మండల స్థాయిలో పరిష్కారం అవుతుందని, అక్కడే చూసుకోవాలన్న ఆ అధికారుల సూచన మేరకు కార్యాలయంలో తహశీల్దార్ నాగమణిని పలుమార్లు కలిసామన్నారు. మొదట్లో ఆమె స్పందించి త్వరలోనే పట్టాదారు పుస్తకాలు ఇస్తామని చెప్పారన్నారు. కానీ రాను రాను సమస్యను దాటవేస్తూ పరిష్కారం చూపకుండా తప్పించుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదే సర్వే నెంబర్లలో తమకు కాకుండా మిగతా వారికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఎలా వచ్చాయని, తమకు మాత్రమే ఎందుకు ఆగుతున్నాయో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను పట్టించుకోవడం లేదనే తహశీల్దార్

కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చామని తెలిపారు. అనంతరం పట్టాదారు కమలమ్మ మాట్లాడుతూ.. ధరణి వచ్చిన తర్వాత అన్ని రకాల ఇబ్బందులు పడుతున్నామని, తహశీల్దార్ కార్యాలయానికి ఎన్నిసార్లు వచ్చి విన్నవించుకున్నా సమస్య పరిష్కారం కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహశీల్దార్ నాగమణిని వివరణ కోరగా.. ఆమె మాట్లాడుతూ.. తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి తల్లిదండ్రులు తొమ్మిది నెలల క్రితం దరఖాస్తు ఇచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. ఆ సమస్య ధరణి ప్రాసెస్‌లో ఉన్నదని, ఎంత సమయం పడుతుందో చెప్పలేమని తెలిపారు. సిఐ బాలరాజు జోక్యం చేసుకొని తహశీల్దార్‌తో మాట్లాడిన అనంతరం అక్కడి నుంచి వారిని పంపించి వేశారు.

డివికె ఆశయాలు కొనసాగిద్దాం

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్
- డివి కృష్ణ స్మారక స్థూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి – హైదరాబాద్

విప్లవోద్యమ నాయకులు, ఆదర్శ కమ్యూనిస్టు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డివి కృష్ణ అని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జాతీయ కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్ అన్నారు. బుధవారం డివి కృష్ణ వర్ధంతిని పురస్కరించుకొని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రేడియో స్టేషన్ ఎదురుగా నిర్మించిన డివికె డివికె స్మారక స్థూపాన్ని ప్రదీప్ సింగ్ ఠాగూర్ ఆవిష్కరించారు. ముందుగా రేడియో స్టేషన్ నుంచి సభాస్థలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ప్రదీప్ సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ.. డివి కృష్ణ ఆదర్శ కమ్యూనిస్టు అని, విప్లవోద్యమానికి ఆయన కృషి అజరామరం అని కొనియాడారు. డివికె 50 ఏళ్ల విప్లవ జీవితమంతా.. సైద్ధాంతిక, రాజకీయ రంగాలన్నింటినీ నిశితంగా పరిశీలన చేసి పార్టీని సరైన పంథాలో తీర్చిదిద్దడానికి కృషి చేశాడన్నారు. 50 సంవత్సరాల విప్లవ జీవితమంతా విప్లవోద్యమం నిర్మించడానికి, అతివాదం, మితవాదాన్ని వ్యతిరేకించి నిలబడ్డారని అన్నారు. ఆయన ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు ఉన్నతమైనవని, వాటిని కొనసాగించడమే ఆయనకు మనమిచ్చే వినమ్ర విప్లవాంజలి అవుతుందని తెలిపారు. సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికత్వం ప్రశ్నార్ధకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఒకప్పుడు నియంతృత్వానికి వ్యతిరేకంగా పోరాడి, విప్లవోద్యమాలను అక్కున చేర్చుకున్న ఉత్తర తెలంగాణలో పార్లమెంటు ఎన్నికల్లో ఫాసిస్టు బిజెపి ఎంపిలు గెలవడం బాధాకరమన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం పరీక్ష పేపర్లను లీకులు చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల జీవితాలతో ఆటలాడుకుంటున్నదన్నారు. ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. ప్రజా ఉద్యమాలతో పాలకవర్గాల మెడలు వంచడమే కామ్రేడ్ డివికెకు ఇచ్చే నిజమైన నివాళి అవుతుందన్నారు. కార్యక్రమంలో ఒపిడిఆర్ జాతీయ అధ్యక్షులు భాస్కర్ రావు, న్యూడెమోక్రసీ జాతీయ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు కె యాదగిరి, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కె రాంచందర్, కె రమ, వి ప్రభాకర్,నగర కార్యదర్శి ఎం సుధాకర్, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి గోదావరి, కె సంధ్యారాణి, రాష్ట్ర కమిటీ సభ్యులు, పార్టీ జిల్లా నాయకులు, ప్రజాసంఘాల బాధ్యులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.